క్లుప్తంగా

మంచి ఫలితాలు సాధించాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పెదపాడు : 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి విద్యార్థులకు సూచించారు. పెదపాడు మండలం శౌరిపురంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. అనంతరం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి నగదు విడుదల

పెదపాడు : మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకంలో 9,523 మందికి పింఛన్ల పంపిణీకి రూ.6.44 కోట్లు విడుదల చేసినట్లు ఎంపీడీఓ జె.తేజరతన్ తెలిపారు. పెదపాడు మండలంలోని 23 గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి నగదు విడుదల చేసినట్టు చెప్పారు. వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వికలాంగులకు రూ.7 వేలు, డయాలసిస్ పింఛన్లు రూ.10 వేలు, డీఎంహెచ్ఓ పింఛన్లు రూ.15 వేలు చొప్పున అందిస్తామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకే వచ్చి అందిస్తారని తెలిపారు. లబ్ధిదారులు గ్రామ సచివాలయాలు, బ్యాంకులకు రావాల్సిన అవసరం లేదని వివరించారు.

నేడు పీఎం మన్‌కీ బాత్

దెందులూరు: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దూరదర్శన్ సప్తగిరిలో తెలుగులో ప్రసారమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ తెలిపారు. మండల ప్రజలు, యువత భారత ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని కోరారు.

రెండు గ్రామాల్లో లైన్‌మన్ల కొరత

దెందులూరు: మండలంలో పెరుగ్గూడెం, శ్రీరామవరం గ్రామాల్లో అసిస్టెంట్ లైన్‌మన్‌లు లేకపోవడంతో శాఖాపరంగా తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాఖాపరంగా ఏ సమస్య వచ్చినా రామారావుగూడెం గ్రామ లైన్‌మన్ వచ్చే వరకు వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఒక గ్రామం లైన్‌మన్ ఆ గ్రామంతో పాటు పక్క రెండు గ్రామాల్లో అదనపు బాధ్యతలు ఎలా నిర్వహిస్తాడని, గ్రామ జనాభాను దృష్టిలో పెట్టుకుని పెరుగ్గూడెం, శ్రీరామవరం గ్రామాల్లో అసిస్టెంట్ లైన్‌మన్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



కొవ్వలిలో డ్రైయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ రామ్‌జీ

దెందులూరు: కొవ్వలి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం ఎంపీడీఓ వి.శ్రీలత, ఉపాధి ఏపీఓ దశరథరామ్‌జీ పరిశీలించారు. కాలువల్లో మురుగు తొలగింపు, బ్లీచింగ్, ట్యాంక్‌లు శుభ్రంచేయడం వంటి పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ, టీడీపీ నాయకులు కసుకుర్తి రామకృష్ణ, సుధాకర్, నాగరాజు ఉన్నారు.

వరి నాట్లు ప్రారంభం



మలకచర్లలో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఈ నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా 1318 రకం విత్తనాన్ని సాగుచేస్తున్నారు. దెందులూరు మండలం మలకచర్లలో 5104 (సోనా మసూరి) రకం విత్తనాన్ని రైతు పర్వతనేని నరేంద్ర సాగు చేస్తున్నారు. సాగునీరు పుష్కలంగా ఉండడం, దీనికి వర్షాలు తోడుకావడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని శనివారం ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్విని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డయేరియా కట్టడే లక్ష్యం

భీమడోలు: డయేరియా కట్టడే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తోందని ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.చంద్రశేఖర్ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెంకు చెందిన వృద్ధురాలు చిగురుపాటి పుష్పరాజ్యం, లింగంపాడుకు చెందిన కోనా చంద్రకాంతంలు కలుషిత ఆహారం తిని డయేరియా బారిన పడి చికిత్స పొంది కోలుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగుందని, వారిలో పుష్పరాజ్యం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాగా చంద్రకాంతం ఆసుపత్రిలో వైద్య పొందుతోంది. ఈ నేపథ్యంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీలు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు భీమడోలులో పర్యటించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న చంద్రకాంతం ఆరోగ్య పరిస్థితిని గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని, తాను ఉపాధి నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లిన తరుణంలో తిన్న ఆహారం కలుషితమైందని ఆమె చెప్పింది. ఆమెకు ఉచితంగా మందులను అందించారు. వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డయేరియాను పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డాక్టర్ శ్రీలక్ష్మి చెప్పారు.



భీమడోలు సీహెచ్‌సీలో చంద్రకాంతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న గుండుగొలను వైద్యాధికారిణి శ్రీలక్ష్మి



అర్జావారిగూడెంలో మంచినీటి ట్యాంకు వద్ద నీటి స్వచ్ఛతను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ చంద్రశేఖర్, డీఈ రమేష్, వివిధ శాఖల సిబ్బంది

నీటి నాణ్యత పరిశీలన

ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.చంద్రశేఖర్, డీఈ రమేష్‌లు గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. నీటి నాణ్యతను పరీక్షించారు. పైపులైన్ లీకేజీలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలను పగడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ లోపం వల్ల సీజనల్ వ్యాధులు సోకినా, డయేరియా కేసులు నమోదైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య కార్యక్రమాలు, స్వచ్ఛమైన మంచినీటిని పంచాయతీలు గ్రామ ప్రజలకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రామారావు, ఈవోఆర్‌డీ కె.సుందరి, గ్రామకార్యదర్శి ఎం హేమ సుందర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసులకు సత్వర పరిష్కారం

భీమడోలు: రాజీమార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారం లభిస్తుందని భీమడోలు జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ తల్లాప్రగడ అంజని ఎస్ఎస్ రామాదిత్య రిషిత్ అన్నారు. భీమడోలు కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. వివిధ మండలాల పోలీసులు, న్యాయవాదుల సమక్షంలో ఇరువర్గాల కక్షిదారులతో చర్చించి లోక్‌అదాలత్ వల్ల కేసుల పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిషిత్ మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ల వల్ల రాజీమార్గంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, దీంతో సమయం, డబ్బు వృథా కాకుండా ఇరువర్గాల కక్షిదారులకు అన్ని విధాలుగా తక్షణ మేలు చేకూరుతుందని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లోక్‌అదాలత్‌లో సివిల్ 6, క్రిమినల్ 29 కేసులను పరిష్కరించారు. భీమడోలు, దెందులూరు, ద్వారకాతిరుమల మండలాల పరిధిలోని కక్షిదారులు స్వచ్ఛందంగా పాల్గొని కేసులను పరిష్కరించుకున్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రిషిత్

‘విద్యాప్రవేశం’ను విజయవంతం చేయాలి

గణపవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాప్రవేశం, బడిబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.బాలభాస్కరరావు కోరారు. శనివారం పాఠశాలలో హెచ్‌ఎం అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి, విద్యాప్రవేశం, బడిబాట కార్యక్రమాల లక్ష్యాలు వివరించారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు మాట్లాడుతూ బడిఈడు గల పిల్లలు బడిలోనే ఉండాలని, బాలికలను తప్పనిసరిగా బడికి పంపాలని, పిల్లలను పనిలోకి పంపరాదని అన్నారు. బడికి వెళ్లని పిల్లలు ఉంటే బడిలో చేర్పించడానికి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, ప్రభుత్వం ఇస్తున్నరాయితీలు, నాణ్యమైన బోధనా పద్ధతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మేఘన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 583 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిందని, ఈఏడాది పీఎంశ్రీ పథకానికి తమ పాఠశాల ఎంపికైందని వివరించారు. పలువురు తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం బాలభాస్కరరావు

అధిక ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూలును నియంత్రించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సీపీఎం శనివారం ధర్నా చేసింది. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఏటా భారీగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని తమ ఆదాయాలలో అధిక భాగం ఫీజులకే కడుతున్నారని, అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని, జర్నలిస్టులకు ఉచితంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టానుసారం యూనిఫారం, పుస్తకాలు, మెటీరియల్ అమ్ముకుని వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల స్కూల్, కాలేజీ ఫీజుల కంటే వీటి ఖర్చే అధికంగా ఉంటోందన్నారు. విద్యార్థులు, టీచర్లు 1: 20 నిష్పత్తి ఉండాలని, పట్టణాల్లో వెయ్యి చదరపు గజాల ఆటస్థలం, క్రీడా పరికరాలు, ల్యాబ్, లైబ్రరీ, విద్యార్థుల వాహనాల పార్కింగ్‌కు స్థలం, షెడ్లు, తరగతి గదుల్లో బల్లలు, ఫ్యాన్లు, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. చాలా స్కూళ్లలో ఈ సౌకర్యాలు అరకొరగా ఉంటున్నాయని వివరించారు. స్కూల్ బస్సుల్లో విద్యార్థులను అధికంగా ఎక్కిస్తున్నారని, కార్పొరేట్ విద్యా సంస్థలు ఒక పర్మిషన్‌తో రెండు సంస్థలను నడుపుతున్నాయని విమర్శించారు. ఫీజుల నియంత్రణకు ఒక సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వ నిబంధనలు ప్రమాణాలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్, ఎం ఇసాక్, జి.శారద, చింతాడ వెంకటలక్ష్మి, బి.లక్ష్మీ కుమారి, జి.ఏసుబాబు, పార్టీ సీనియర్ నాయకులు కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

70 మంది దివ్యాంగుల ఎంపిక

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఏలూరు పర్యవేక్షణలో దెందులూరు నియోజకవర్గ దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత ఉపకరణాలకు 18 సంవత్సరాల్లోపు ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు నిర్ధారించినట్టు సమన్వయకర్త బొర్రా భాస్కరరాజు తెలిపారు. పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్, పెదవేగి నాలుగు మండలాల నుంచి 70 మంది దివ్యాంగులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, అన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు పీవీ రామశర్మ, ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, మూడు మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీ టీచర్‌లు హేమలత, శ్రీదేవి, ఎంఆర్‌సీ స్టాప్, దివ్యాంగుల తల్లితండ్రులు ఉన్నారు.



దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్టు సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరపీ, యూడీఐడీ, నిరామయ హెల్త్ కార్డులు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి కృత్రిమ అవయవాన్ని అందించిన శ్రీనివాసరెడ్డి

నిధులు మంజూరు చేయించండి

భీమడోలు: గుండుగొలను నుంచి భోగాపురం మీదుగా లంక గ్రామాలను కలిపే అధ్వానంగా ఉన్న రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు వగ్వాల భాస్కర్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. గుండుగొలను నుంచి భోగాపురం వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా మారి నడిచేందుకు కూడా అనుకూలంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గోతుల వల్ల వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో చర్చించి తారురోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యేను భాస్కర్ కోరారు.

ఠాగూర్ సేవలు అభినందనీయం

భీమడోలు: భీమడోలు గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి ఎన్ ఠాగూర్ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ గ్రామ సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రేడ్-1 ఈఓ ఎన్ ఠాగూర్‌కు పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఠాగూర్ దంపతులకు జ్ఞాపికతో పాటు సన్మాన పత్రం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వర్ణలత, ఈవోఆర్‌డీ సుందరి, తదితరులు పాల్గొన్నారు.



ఠాగూర్ దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్

ఐటీడీఏను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

బుట్టాయగూడెం: ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శనివారం కేఆర్‌పురం ఐటీడీఏను సందర్శించింది. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజతో పీఓ చాంబర్‌లో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టు ప్రాముఖ్యత, ఆయకట్టు వివరాలు, ముంపు గ్రామాలు, ఆర్అండ్‌ఆర్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్‌లు సీహెచ్ కళ్యాణి(కర్నూలు), దమేరా హిమ వంశీ(చిత్తూరు), బొల్లిపల్లి వినుత (అనంతపురం), పవార్ స్వప్నిల్ జగన్నాథ్(గుంటూరు), హెచ్ఎస్ భావన (కాకినాడ), శుభమ్ నోఖ్వాల్ (ఎన్టీఆర్ జిల్లా) పాల్గొన్నారు.

కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం కృష్ణా డెల్టాకు తక్షణం సాగునీరు విడుదల చేయాలని రైతులు శనివారం ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం సుంకరవారితోట పరిసర పంట చేలల్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పంట భూములు ఇటు కృష్ణ, అటు గోదావరికి శివారు ప్రాంతం కావడం వల్ల సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు పూర్తి కావస్తున్నప్పటికీ ఏలూరు రూరల్ మండల గ్రామాల సాగు భూములకు నేటికీ నీరు అందలేదని వాపోయారు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో రైతులు నేటికీ నారుమడులు వేయలేదని, సాగు ఆలస్యమైతే రైతులు మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సమయం దాటి నెల రోజులు అయినప్పటికీ డెల్టాకు సాగునీరు విడుదల చేయకపోతే సాగు ఏలా చేయాలంటూ ప్రశ్నించారు. సాగునీటి విడుదలపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు, అన్నంరెడ్డి రంగారావు, ఆకిరి నాగరాజు డిమాండ్ చేశారు. ఆందోళనలో పిట్టా రమణ, తలారి జయరాజు పాల్గొన్నారు.



పొలాల్లో ఆందోళన చేస్తున్న రైతులు

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10వ తరగతి, ఆ పైన విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. యువకులు ఫోన్ నెంబర్లు 99485 65256, 95330 79471లో సంప్రదించాలని సూచించారు.

సెలవుపై వెళ్లిన ఈవోపీఆర్డీ సరళకుమారి

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల ఈవోపీఆర్డీ ఎం సరళకుమారి 15 రోజుల సెలవుపై వెళ్లారని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ వై.సుజాత తెలిపారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిని నియమించాలని కోరుతూ ఎంపీడీఓ బి.ప్రణవి జిల్లా పంచాయతీ అధికారిని కోరారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వికలాంగుల సంక్షేమ సంఘం విసాస్, ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజ్ కోరారు. పర్సంటేజ్ పేరుతో గతంలో దివ్యాంగులను తొలగించారని పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగునికీ కొత్త ప్రభుత్వం రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచే దివ్యాంగుల పింఛన్లు అందించాలని కోరారు. అర్హులు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షం.. ప్రజలకు ఉపశమనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మూడు రోజులుగా దోబూచులాడిన వాన శనివారం రాత్రి ఒక్కసారిగా విరుచుకుపడింది. ఉదయం సైతం నేల తడుపు చినుకులు తప్పించి పట్టుమని 10 నిమిషాల పాటు వాన కురవలేదు. రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ప్రజలు ఉపశమనం పొందారు. అరగంట పాటు ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. అనంతరం వాన తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తమ గమ్యస్థానాలకు బయలుదేరారు. భారీగా వానకు రోడ్లు జలమయమై వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



గేదెకు పోస్టుమార్టం నిర్వహించిన మండల పశు వైద్యశాఖాధికారి రామ్మోహనరావు

దెందులూరు: రామారావుగూడెంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గేదెకు శనివారం దెందులూరు మండల పశువైద్యశాఖాధికారి డాక్టర్ రామ్మోహనరావు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్ షాక్‌తోనే గేదె మృతిచెందిందన్నారు. ఈ మేరకు నివేదికను మండల ట్రాన్స్‌కో ఏఈకి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కృష్ణకుమారి, విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ జోసెఫ్ తంబి, టీడీపీ నాయకులు బాలిన నాగరాజు, రావి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా నర్సింహమూర్తి

ఉంగుటూరు: నారాయణపురం ది విశాల పరపతి సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా కె.నర్సింహమూర్తి శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఏలూరు సబ్‌డివిజన్ కోఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రారుగా పని చేస్తోన్న నర్సింహమూర్తిని సొసైటీకి ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. వైఎస్సార్ సీపీ హయంలో తీమెన్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన యెలిశెట్టి పాపారావుబాబ్జి ఈనెల 8వ తేదీన రాజీనామా చేశారు. మిగిలిన ఇద్దరు సభ్యులు ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాచేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహమూర్తి

3న ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 3వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హజరుకావాలని కోరారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హజరవుతారని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

షంషుద్దీన్ సేవలు ఆదర్శనీయం



షంషుద్దీన్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ఈవోపీఆర్డీగా షంషుద్దీన్ అందించిన సేవలు ఆదర్శనీయమని వక్తలు కొనియడారు. ఉంగుటూరు మండలంలో దీర్ఘకాలం పంచాయతీ ఈఓగా, ప్రస్తుతం ఉంగుటూరు ఈవోపీఆర్డీగా పని చేసిన షేక్ షంషుద్దీన్ పదవీ విరమణ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఆయనకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. షంషుద్దీన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, డీపీఓ మల్లికార్జునరావు, ఉపాధిహామీ ఏపీఓ రాము, ఏలూరు డీఎల్‌డీఓ జి.రమణ, ఏలూరు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత పుప్పాల గోపి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులు, టీడీపీ నాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.